# అదిగో శ్రీమతి

- వాణిశ్రీ

హౌసింగ్ బోర్డు కాలనీలో తులశమ్మ సీనియర్ గృహిణి. సిటీకి దూరంగా ఉండడం వలన కొత్తలో హౌసింగ్ బోర్డు కాలనీలో కాపురం పెట్టడానికి భయపడేవాళ్ళు. స్వంత ఇంటి కల నిజం చేసుకున్నందుకు దూరమైనా గృహప్రవేశం చేసుకోక తప్పలేదు చాలామందికి. వారిలో తులశమ్మ ముందు వరుసలో ఉంటుంది.

ఎల్ఐజి ఇళ్లల్లో తొలిసారి గృహప్రవేశం చేసింది తులశమ్మ కుటుంబమే. తులశమ్మ భర్త ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్. జీతం తక్కువ. గీతం ఎక్కువ. తులశమ్మకు చదువు చట్టుబండలు లేవు. లైన్లో మగాళ్ళు ఆఫీసులకు పోయాక ఎవరో ఒకరింటికి పోయి కబుర్లతో కాలక్షేపం చేసేది.

తర్వాత్తర్వాత టీవీ సీరియల్స్ ఎందరో ఇల్లాళ్ళను ఆకర్షించగలిగినా తులశమ్మను మాత్రం వీసమెత్తు కదిలించలేకపోయాయి. కొందరు ఎల్ఐజి ఇళ్ళు పడగొట్టి మూడేసి అంతస్తులు కట్టుకోవడం మొదలుపెట్టారు.

ఆ విధంగా హౌసింగ్‌బోర్డు కాలనీ స్వరూపం మారిపోయింది.

ఒకేలైన్లో ఇరవై కుటుంబాల బదులు నలభై, యాభై కుటుంబాల వరకూ పెరిగి తులశమ్మ సామ్రాజ్యం విస్తరించింది.

ఒకరోజు ఆ లైన్లో చివరింటికి కొత్తగా ఒక కుటుంబం దిగింది. లారీలో సామాన్లు దింపడం గమనించిన తులశమ్మ వచ్చింది ఎవరూ? అంటూ ఎంక్వయిరీ మొదలుపెట్టింది. కొత్తగా పెళ్ళయిన వాళ్ళు మాత్రం కాదు. నడి వయసు దంపతులే. వాళ్లకి ఒక్కడే కొడుకు. తర్వాత ఆ ఇంటికి ఒక బోర్డు వెలిసింది.

లేడీస్ టైలర్.

ఇకనేం తులశమ్మకు సమాచారం సేకరించడానికి దారి దొరికింది. ఒక జాకెట్ ముక్క పట్టుకెళ్ళింది. ఆమె నవ్వుతూ ఆహ్వానించింది.

"అమ్మాయీ! నీ పేరేంటి?'' అంటూ చతికిలబడింది.

"నా పేరు సీతండీ'' అన్నదామె నవ్వుతూ.

తులశమ్మ ఎంక్వయిరీ మొదలుపెట్టింది. ఆమెతనకు ముప్ఫయి ఐదేళ్లంటే ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

"అంత వయసున్నట్లు కనిపించవు. నిన్ననో, మొన్ననో పెళ్ళయిన దానిలా ఉన్నావు'' అని కాంప్లిమెంట్ విసిరింది.

సీత నవ్వి ఊరుకుంది.

ఒకబ్బాయి స్కూల్ బ్యాగ్ తగిలించుకుని బైటకు వచ్చాడు.

"మా అబ్బాయి కిరణ్. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు'' అని చెప్పింది సీత.

"గుడ్‌మాణింగ్ ఆంటీ'' అంటూ సైకిల్ తీసుకుని వెళ్ళిపోయాడు కిరణ్.

తల్లిలాగే కిరణ్ కూడా ఎర్రగా, పొడుగ్గా అందంగా ఉన్నాడు.

"మీ వారేం చేస్తారు?'' అడిగింది తులశమ్మ.

"మా వారు స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసరండీ'' అంది సీత.

"బ్యాంక్‌లో ఉద్యోగం అంటే మంచి జీతమే వస్తుందిగా. ఇక నీకెందుకమ్మా ఈ కుట్టుపని? దర్జాగా కాలుమీద కాలు వేసుకుని తినొచ్చు'' అంది తులశమ్మ.

సీత సమాధానం చెప్పలేదు.

కొంచెంసేపు కూర్చుని "ఏమిటో? ఎవరి పిచ్చి వారికి ఆనందం'' అనుకుంటూ వెళ్లిపోయింది.

* * *

'భర్త బ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కడే కొడుకు. అత్తమామలు, ఆడపడుచు, మరుదులు వంటి బాదరా బందీ లేదు. సీత టైలరింగ్ చేసి డబ్బు సంపాదించాల్సిన అవసరం ఏంటి?' అనే విషయం మీద ఆ లైన్లో ఇల్లాళ్ళ మీటింగ్‌లో చర్చకు పెట్టింది తులశమ్మ.

"భర్త బ్యాంక్‌లో ఆఫీసరైతే ఏంటీ? భార్య సంపాదించకూడదా? వేడినీళ్లకు చన్నీళ్ళు తోడు''

"మనకేం తెలుసు ఆవిడ కష్టాలేమిటో? కొందరు మగాళ్లకి ఎంత జీతం వచ్చినా తాగి తందనాలాడో, పేకాట వ్యసనంలో చిక్కుకునో డబ్బు తగలేస్తుంటారు. ఇంట్లో పెళ్ళానికి ఇవ్వడానికి ఏడుస్తారు. సీత మొగుడు ఆ బాపతేమో?''

"నిజమేనేమో! అంత పెద్ద బ్యాంక్ ఆఫీసరు ఇక్కడ చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని ఎందుకుంటాడు? స్వంత ఇల్లు కట్టుకోలేడా? పేకాటో, గుర్రాల వ్యసనమో ఉండి ఉంటుంది. పాపం పెళ్ళాం ఏం చేస్తుంది జాకెట్లు కుట్టుకోక?''

"సీత మెడలో కూడా ఏమంత బంగారం లేదు. ఆమె పుట్టింటివాళ్ళు లేనివాళ్లయి ఉంటారు. అతగాడు ఎర్రగా బుర్రగా ఉందని కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడేమో? అందువల్ల అత్తమామలతో ఈవిడకు పడడం లేదేమో? అత్తాకోడళ్ళ కొట్లాటలకు విసిగిన మొగుడు ఈవిడను తెచ్చి ఇక్కడ కాపురం పెట్టి ఉంటాడు''

"కావొచ్చు. అతగాడు రోజూ ఇంటికి వస్తున్నట్లు లేడు. ఎప్పుడో వారానికి ఒకసారి కనిపిస్తుంటాడు. అత్తాకోడళ్ళ గొడవేనేమో?''

"అందువల్లే మొగుడి జీతం మీద ఆధారపడకుండా సొంత క్కాళ్ళమీద నిలబడాలని ఇలా టైలరింగ్ చేస్తున్నది సీత''

తులశమ్మ అధ్యక్షత వహించిన మీటింగ్‌లో పాల్గొన్న ఇల్లాళ్ళు రకరకాలుగా ఊహిస్తూ సీత టైలరింగ్ చేయడం అదే విషయం మీద చర్చించారు.

సీత మాత్రం పొద్దున్నే వాకిలి ఊడ్చి కళ్లాపి చల్లి ముగ్గులేసేటప్పుడు మాత్రమే ఎవరికైనా కనిపించేది. తర్వాత టైలరింగ్ చేస్తూ ఉండేది.

చెప్పిన సమయానికి జాకెట్లు కుట్టి ఇవ్వడమే కాకుండా మంచి పనితనం కూడా కనిపించడం వల్ల ఆమెకు టైలర్‌గా అనతికాలంలోనే మంచి పేరు వచ్చింది. చేతినిండా పని ఉండేది.

తులశమ్మ మాత్రం సీత జీవితానికి సంబంధించిన విషయ సేకరణ మాత్రం మానలేదు.

"మీకీ విషయం తెలుసా?'' అంటూ ఒకరోజున అధ్యక్షోపన్యాసం మొదలుపెట్టింది తులశమ్మ.

"ఏమిటి వదినా?''

"పిన్నికి ఎక్కడ్నుంచి వస్తాయో వార్తలు.

ట్వంటీఫోర్ అవర్స్ న్యూస్ ఛానెల్ మాదిరే చెప్పుంటుంది?''

"అంకుల్‌ది తిరిగే ఉద్యోగమేగా? ఎక్కడెక్కడో సేకరించి ఆంటీకి చెప్పుంటాడు''

"మనసుంటే మార్గం ఉంటుందంటారు. తెలుసుకోవాలని ఉంటే అవే తెలుస్తాయి'' అంది తులశమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"ఇంతకీ అసలు సంగతి ఏమిటి వదినా?''

"అదే చెప్తున్నా. సీతకి పెళ్లి కాలేదట. ఆ బ్యాంక్ ఆఫీసర్ ఎవడో ఉంచుకున్నాట్ట'' బాంబ్ పేల్చింది తులశమ్మ.

"ఆ(..అలాగా!'' అని నోళ్ళు తెరిచారు అంతా.

"అదా! సంగతి! అందుకే అతగాడు వారానికొక రోజు వచ్చిపోతున్నాడు. మిగతా రోజులు భార్యాపిల్లలతో ఉంటాడన్నమాట''

"నేనప్పుడే అనుకున్నా. పెద్ద బ్యాంక్ ఆఫీసర్ పెళ్లాం ఇట్లా సామాన్యంగా ఉందేమిటా అని?''

"బ్యాంక్ ఆఫీసర్ సొంత ఇల్లు కట్టుకోలేడా? మనకాలనీలో అద్దెకు ఎందుకు దిగుతాడు? నాకు అప్పుడే అనుమానం వచ్చింది. ఐనా మనకెందుకు?''

"ఉంచుకున్నోడు ఏమిస్తాడు? నెలకి వెయ్యో, పదిహేనువందలో ముఖాన కొట్టిపోతాడు. అది ఇంటి అద్దెకు సరిపోతుంది. ఇక కొడుకు, తను ఏం తింటారు మట్టి? అందుకే జాకెట్లు కుట్టి ఇల్లు గడుపుకుంటోంది''

"ఎర్రగా, బుర్రగా ఉంది కదా! పెళ్లెందుకు కాలేదో?''

"అమ్మా అయ్యా పెళ్ళి చేసేవరకూ ఆగుతున్నారా ఇప్పటివాళ్ళు. మిస్ ఇండియాలా ఉన్నావనో, మిస్ యూనివర్సల్ అనో పొగిడే సరికి సినిమాల్లో చేరిపోదామనీ, హీరోయిన్ అవుదామనీ చెక్కేస్తున్నారు. అక్కడ అందరి చేతుల్లో నలిగి దిక్కుతోచక ఇట్లా ఎవడికో ఉంపుడుకత్తెగా మారతారు''

"అందరూ అట్లా ఎందుకు పోతార్లే! ప్రేమించామనీ, పెళ్ళి చేసుకుంటామనీ ఎవడో మాయలో పడేసి కడుపు చేసి వదిలేస్తే కూడా అధోగతే''

"ఏం చేస్తాం? కలియుగం. పిదపకాలం పిదపబుద్ధులు''

★ ★ ★



సంసారుల ఇళ్లమధ్య సీతలాంటి ఉంపుడుకత్తె ఉండడం మంచిది కాదని తులశమ్మ ఎంత ఊదరగొట్టినా ఎవరూ పట్టించుకోలేదు. తులశమ్మ మొగుడు మౌనంగా ఉండిపోయాడు. మరికొందరు మగాళ్ళు పెళ్ళాల్ని తిట్టారు.

"ఆవిడ్ని ఎవడో ఉంచుకుంటే మీకెందుకు? మీకేం ఇబ్బంది? మీకు ఇష్టం లేకపోతే ఆవిడతో జాకెట్లు కుట్టించుకోకండి"

"నువ్వు చెప్తున్నావు గాని నాకట్లా అనిపించడంలా!"

"ఆ ఇల్లు అద్దెకిచ్చినాయనకు లేని పట్టింపు మీకెందుకు? ఆమె ఇక్కడ వ్యభిచారం చెయ్యడం లేదుకదా?"


"అసలు ఆవిడకు పెళ్ళికాలేదనీ, ఎవడో ఉంచుకున్నాడనీ మనకు రుజువు లేంటీ?"

"అపార్ట్‌మెంట్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం చేస్తుంటేనే దిక్కులేదు. పోలీసులొచ్చేదాకా ఎవరూ మాట్లాడ్డం లేదు. ఆమె తన పనేదో తాను చేసుకుంటూ బతుకుతుంటే ఈ కాలనీలో ఉండొద్దనడానికి మనం ఎవరం?"

## జాస్మిన్ పరిమళం



కొంతమంది తారలు పాత తారల అభిరుచుల్ని, అందాన్ని పుణికి పుచ్చుకున్నారేమో అన్పిస్తుంది. తాజాగా మీరాజాస్మిన్ సంగతినే అందరూ ప్రస్తావిస్తున్నారు. ఇప్పుడామె అవకాశాల విషయంలో అందరికంటే భిన్నమైన వైఖరిని అవలంభిస్తున్నట్టు కన్పిస్తోంది. ఈ విషయంలో మీరాజాస్మిన్ అలనాటి నటి సౌందర్య తరహాలో నటిస్తున్నట్టు ఉందంటున్నారంతా. రోజురోజుకీ పోటీ పెరిగిపోతున్న తరుణంలో ఎలాంటి జిమ్మిక్కులు చేయకుండా మంచి నటనా కౌశలంతో ఆమె అందర్నీ ఆకట్టుకుంటోంది. ఇప్పుడు తెలుగు చిత్రసీమకి మంచి నటి లభించిందని మీరాజాస్మిన్‌ని ఉద్దేశించి అంటున్నారంతా. బెస్టాఫ్‌లక్ మీరా!




ఈ విధంగా మగాళ్ళు తలోకమాట అనేసరికి ఇల్లాళ్ళు ఏం మాట్లాడలేక పోయారు. ఆ లైన్లో నుంచి సీతను కదపాలన్న తులశమ్మ అభీష్టం నెరవేరలేదు.

ఐనా సందు దొరికినప్పుడల్లా సీతను ఆడిపోసుకోవడం మానలేదు తులశమ్మ.

సీత కొడుకు కిరణ్‌ని కూడా అందరి ముందూ ఏదొకటి అని అవమానిస్తుండేది. కిరణ్ మాట్లాడకుండా వెళ్ళిపోయేవాడు.

కొన్నాళ్లకి సీత సంగతి పాతబడిపోయింది. ఏళ్ళు గడిచిపోయాయి. సీత అద్దెకు ఉన్న ఇల్లు అమ్మకానికి పెట్టాడు యజమాని. ఆశ్చర్యంగా సీత ఆ ఇల్లు కొనేసింది. సీత కొడుకు ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. బెంగుళూరులో ఉద్యోగం వచ్చింది. నెలకి ముప్పై వేలు జీతం.

తర్వాత ఒక సుముహూర్తం నుంచి తులశమ్మ ధోరణి పూర్తిగా మారిపోయింది. సీతను దేవత అంటూ పొగడడం మొదలుపెట్టింది. ఆ లైన్లో ఇల్లాళ్లకు విషయం ఏమిటో వెంటనే అర్థం కాలేదు. ఏదో బలమైన కారణం ఉండి ఉంటుందని అనుకున్నారు.

"సీతను ధర్మారావు ఉంచుకున్నాడని అనుకున్నాం గాని అది నిజం కాదట" అంటూ మొదలుపెట్టింది తులశమ్మ.

"అదేంటి వదినా? అలా అని నువ్వే కదా అప్పుడు చెప్పావు?"

"అసలు సంసారుల మధ్య సీతలాంటి ఉంపుడుగత్తె ఎలా ఉంటుందని గొడవ కూడా చేశావు కదా?"

కొందరు తులశమ్మను నిలదీశారు.

"నాకేం తెలుసు? ఎవరో అంటేను, నిజమే అనుకున్నా. లోకం తీరే అంత. అదిగో పులి అంటే ఇదుగో తోక అంటారు"

"అసలు నిజం ఏంటో?"

"అదే చెప్తున్నా. ధర్మారావు, సీత ప్రేమించుకున్నారట. సీత వాళ్లది బీద కుటుంబమట. కట్నాలు, కానుకలు ఇచ్చుకోలేరని ధర్మారావు తల్లిదండ్రులు అతనికి బలవంతంగా వేరే సంబంధం చేశారట. అతను మాత్రం సీతకు అన్యాయం చేయలేనని గుళ్ళో పెళ్ళి చేసుకుని రెండో భార్యగా చేసుకున్నాట్ట" చెప్పింది తులశమ్మ.

"ఐతే సీత ఉంపుడుగత్తె కాదన్నమాట. కట్టుకున్న పెళ్ళామే"

"కాకపోతే రెండో పెళ్ళాం"

"ఏమో అనుకున్నాం గాని సీత ఎంత గుణవంతురాలు? ఎంత బుద్ధిమంతురాలు? స్వంత కాళ్లమీద నిలబడి బతికింది. కొడుకుని ఇంజనీర్‌ని చేసింది" తులశమ్మ పొగడడం మొదలుపెట్టింది.

ఇల్లాళ్లంతా ముఖాలు చూసుకున్నారు.

తెగడడమే గానీ పొగడ్డం అలవాటులేని తులశమ్మ వదిన అదే పనిగా సీతను పొగడడం వెనకున్న అంతరార్థం ఏంటో ఎవరికీ అర్థంకాలేదు. కాలమే వివరించాలి అనుకున్నారు.

* * *

ఒకరోజు ఉదయం తులశమ్మ ఇంటి ముందు సరికొత్త శాంత్రోకారు ఆగింది. అందులో నుంచి తులశమ్మ కూతురు శ్రావణి, సీత కొడుకు కిరణ్ చెట్టాపట్టాలేసుకుని చిలకా గోరింకల్లా, హీరోహీరోయిన్లుగా దిగారు.

శ్రావణి బెంగుళూరులో మెడిసిన్ చదువుతున్నదనీ, అక్కడే ఉన్న కిరణ్ ప్రేమలో పడిందనీ పుకార్లు షికార్లు చేశాయి.

గత కొన్నాళ్ళుగా సీతను తులశమ్మ అదే పనిగా సుగుణవంతురాలనీ, మహా పతివ్రతనీ ఓవర్‌గా ఎందుకు పొగుడుతూ వచ్చిందో ఆ ఇల్లాళ్లందరికీ అర్థమైంది.

★